


# విభారె

తెలుగు దినపత్రిక


VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 08-03-2026 సంపుటి : 07 సంచిక 289 పేజీలు : 8 వెల : రూ 3-00


# త్వరలోనే రివర్స్ మైగ్రేషన్ మొదలు: సీఎం చంద్రబాబు



న్యూఢిల్లీ, మార్చి 7: ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా స్థానికులతో కలిసిపోయే అత్యుత్తమ డిప్లొమాట్స్ భారతీయులే అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు 'రైసినా డైలాగ్–2026'కు ఆయన హాజరై.. 'సాంకేతికత – సుపరిపాలన – భవిష్యత్తు' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. ప్రపంచ దేశాలకు విస్తృత సేవలు అందిస్తున్న వారిలో భారతీయులే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ప్రత్యేకించి ఐటీ సహా వివిధ రంగాల్లో గ్లోబల్ కమ్యూనిటీ, ప్రపంచ సంక్షేమానికి భారతీయులు విస్తృత సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో సిలికాన్ వ్యాలీలాంటి చోట్లకు మేధో వలసలు జరిగాయని.. కానీ త్వరలో రివర్స్ మైగ్రేషన్ మొదలవుతుందని ఆయన తెలిపారు. నిపుణులు, వనరులు ఉన్న చోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. దూరాలు ఇక అడ్డంకి కాదని, ఎక్కడి నుంచైనా పనిచేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు. నాలెడ్జ్ ఎకానమీలో ఎక్కడైనా పెద్ద కంపెనీని ప్రారంభించి పనిచేసే అవకాశాలున్నాయని చంద్రబాబు తెలిపారు. త్వరలో డేటా సెంటర్ల కోసం గ్రీన్ ఎనర్జీని పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నామన్నారు. భారత్‌లో ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్ జరుగుతోందని చెప్పారు. త్వరలో విద్యుత్ ఎగుమతి చేసేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రీన్ అమ్మోనియా కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి చేస్తున్నామని ఆయన చెప్పారు. ఏఐ, క్వాంటం ఏఐ అల్గారిథమ్స్‌లో పెద్ద అవకాశాలున్నాయన్నారు సీఎం. ఇటీవల ట్రైనింగ్ కోసం పిలుపు ఇస్తే 50వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు. ఏజింగ్ సమస్యను ఎదుర్కొంటున్న దేశాలు జనాభా నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫెర్టిలిటీ రేటును 1.5 నుంచి 2.1కు పెంచేందుకు పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందించామని చంద్రబాబు తెలిపారు. మూడో బిడ్డ పుడితే రూ.25వేల ఆర్థిక సాయం, నెలవారీగా రూ.వెయ్యి అందించాలని నిర్ణయించామని చెప్పారు. చైల్డ్ కేర్ లీవ్‌లాంటి ప్రోత్సాహకాలు ఆలోచిస్తున్నామని వివరించారు. ఓ ప్రజాప్రతినిధిగా గతంలో జనాభా నియంత్రణపై మాట్లాడానని.. ఇప్పుడు భవిష్యత్ ప్రమాదాలను గుర్తించి జనాభా నిర్వహణ పాలసీని ప్రోత్సహిస్తున్నానని ఆయన చెప్పారు. పేద, ధనిక తారతమ్యం లేకుండా జనాభా వృద్ధిపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భారత్‌లో గతంలో పెద్ద కుటుంబాలు దేశ ఆస్తిగా ఉండేవని.. ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారాయన్నారు. ఈ విషయంలో ప్రజల దృష్టి కోణం మార్చే ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# రాష్ట్రపతి ఈవెంట్‌కు మమత డుమ్మా..

## ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘన



కోల్‌కతా: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారంనాడు నార్త్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతాలి సదస్సును ప్రారంభించారు. అయితే తన పర్యటనలో పలు ప్రోటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. భద్రతా కారణాల పేరుతో బిధాన్‌నగర్‌లో జరగాల్సిన సదస్సు వేదకను బాగ్‌డోగ్రా ఎయిర్‌పోర్ట్ సమీపంలోని గోసాయిపూర్‌కు మార్చడం, వేదక చిన్నది కావడంతో గిరిజన కమ్యూనిటీకి చెందిన వారు పెద్దసంఖ్యలో రాలేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఆమె మంత్రులు దూరంగా ఉండిపోయారు. రాష్ట్రపతికి సిలిగురి మేయర్ దేవ్ స్వాగతం పలికారు. సభా వేదిక మార్పుపై ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, ఇక్కడకు రావడం చాలా ఈజీగానే వచ్చానని, అయితే జనసమ్మర్ధం ఎక్కువగా ఉంటుందనే కారణంగా వేదికను మార్చినట్టు అధికార యంత్రాంగం చెప్పిందని తెలిపారు. 'రాష్ట్రపతి వచ్చి జనసమర్ధం లేని చోట ఈవెంట్‌లో పాల్గొని వెళ్లిపోతారని వారు అనుకుని ఉంటారు. వాళ్ల ఆలోచన ఏమిటో నాకు తెలియదు. ఈ పరిణామం చాలా బాధాకరంగా ఉంది' అని అన్నారు. రాష్ట్రపతి తన అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేసినప్పటికీ సీఎం విషయంలో ఆచితూచి మాట్లాడారు. మమతా బెనర్జీ తన చిన్న చెల్లెలని, తాను కూడా బెంగాల్ కూతుర్నేనని అన్నారు. ఏదో కారణం వల్ల ఆమెకు (మమతాబెనర్జీ) తనపై కోపం వచ్చి ఉండవచ్చని అన్నారు. ఆమెపై తానెలాంటి కంప్లయింట్ చేయదలచుకోలేదని చెప్పారు. అందరూ బాగుండాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. నార్త్ బెంగాల్‌లో ఆదివాసీలు, గోర్ఖాలు, రాజ్‌బన్షీలు, బెంగాలీలు కలిసిమెలసి ప్రశాంతంగా జీవిస్తుండటం, సామాజిక సామరస్యం చాటుకోవడంపై రాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. రాష్ట్రపతి తన పర్యటన సందర్భంగా స్థానిక గిరిజనులతో సంభాషించారు. ద్రౌపది ముర్ము రాక సందర్భంగా మమతా బెనర్జీ రాష్ట్రపతి కార్యాలయానికి ఉన్న గౌరవాన్ని దిగజార్చారని బీజేపీ మండిపడింది. ఇది టీఎంసీ ప్రభుత్వ నిర్వహణా వైఫల్యాన్ని చాటుతుందని పార్టీ నేత అమిత్ మాలవీయ అన్నారు.

# విజయవాడలో కాల్పుల కలకలం..

## పోలీసులు, ఈగల్ అధికారులపై ఫైరింగ్




విజయవాడ, మార్చి 7 : విజయవాడ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వ్యక్తి పోలీసులపైనే తుపాకీతో కాల్పులు జరిపేందుకు ప్రయత్నించడం నగరంలో సంచలనంగా మారింది. విజయవాడ పోలీసులు, ఈగల్ అధికారులు బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా తన వద్ద ఉన్న తుపాకీతో అధికారులపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో నిందితుడు ట్రిగ్గర్ నొక్కినప్పటికీ, టెక్నికల్ లోపం కారణంగా బుల్లెట్ ఛాంబర్‌లోకి రాకపోవడంతో అధికారులు ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. కాల్పులు విఫలం కావడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పోలీసులు, ఈగల్ అధికారులు ప్రాణాలకు తెగించి అతడిని వెంటాడి పట్టుకున్నారు. నిందితుడు తెలంగాణ రాష్ట్రం, వరంగల్ జిల్లా, నెల్లికుదురు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి 9 ఓఓ పిస్టల్, ఐదు రౌండ్ల బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు నిందితుడిని అతి కష్టం మీద అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించారు. అసలు ఆ వ్యక్తి విజయవాడకు ఎందుకు వచ్చాడు?, గన్ ఎలా వచ్చింది..?, ఎవరినైనా హతమార్చేందుకు అతడు కుట్ర పన్నాడా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బహిరంగ ప్రదేశంలో, అది కూడా రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడం సామాన్య ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేసింది.

# ఈ ఆరోపణలపై ప్రజలకు జగన్ సమాధానం చెప్పగలరా: లోకేష్



అమరావతి: మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి అనుచరుల జేబుల్లో వేలకోట్లు చేరాయని ఆరోపణలు వచ్చాయని ఏపి మంత్రి లోకేష్ తెలిపారు. గతంలో అక్రమ మద్యం.. వేల కుటుంబాలను నాశనం చేసిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగదు లావాదేవీలకు సంబంధించి ఆధారాలను ఇడి బయటపెట్టిందని తెలియజేశారు. ఈ ఆరోపణలపై ఏపి ప్రజలకు జగన్ సమాధానం చెప్పగలరా? అని..సమాధానం చెప్పలేక.. నిశ్శబ్దమే జగన్ సమాధానమా? అని లోకేష్ ప్రశ్నించారు. ఇదేనా జగన్ 2019లో నిషేధం అమలు చేస్తానన్న హామీ వెనక అసలు కథ? అని లోకేష్ విమర్శించారు.

# కల్తీ నెయ్యి కేసు.. విజయభాస్కర్‌రెడ్డికి హైకోర్టులో దక్కని ఊరట

కల్తీ నెయ్యి కేసులో నిందితుడిగా ఉన్న టీటీడీలో డెయిరీ నిపుణుడు విజయభాస్కర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఊరట దక్కలేదు. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది మోహన్ రెడ్డి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు పూర్తయి ప్రాథమిక చార్జ్ షీట్ దాఖలు చేయడంతో బెయిల్ ఇవ్వాలని మోహన్ రెడ్డి వాదించారు. హవాలా మార్గంలో పిటిషనర్‌కు 75 లక్షల రూపాయలు అందాయని సీబీఐ తరపు న్యాయవాది సురేష్ కుమార్ కోర్టుకు వివరించారు. కాగా, సికింద్రాబాద్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డిని టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నిందితుడిగా(ఏ34) చేరుస్తూ గత నవంబరు 23న నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. అర్హత లేని డెయిరీలకు సహకరించడం ద్వారా ఆయా సంస్థల నుంచి ఆయన భారీగా లబ్ధి పొందారని సిట్ తెలిపింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డెయిరీ ఎండీ జగ్‌మోహన్ గుప్తా నుంచి రూ.2.50లక్షలు లంచంగా తీసుకున్నారని వెల్లడించింది. ఆల్ఫా డెయిరీ ప్రతినిధుల నుంచి 8 గ్రాముల గోల్డ్ కాయిన్.. వైష్ణవి, భోలేబాబా, మాల్‌గంగా, ప్రీమియర్ ఫుడ్స్ తదితర డెయిరీల నుంచి హైదరాబాద్‌లోని హవాలా ఏజెంట్ ద్వారా మొత్తం రూ.83 లక్షలు లంచంగా తీసుకున్నారని ఆరోపించింది.







# సంపాదకీయం

ఆదివారం 08-03-2026

## యుద్ధంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యమే

యుద్ధం ప్రకటించేది ముసలివారు, కానీ పోరాడి చనిపోయేది మాత్రం యువకులే '' .. రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా అధ్యక్షుడుగా వ్యవహరించిన హెర్బర్ట్ హూవర్ చెప్పిన మాట. ఎందుకంటే యుద్ధం వినాశనాన్ని ఆయన కళ్లారా చూశారు మరి. ఇప్పుడు అదే అమెరికాకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ట్రంప్ దీన్ని నిజం చేస్తున్నారు. యుద్ధాలు చూసిన వారు .. యుద్ధాల్లో పాల్గొన్న వారు ఎవరైనా సరే చెప్పే మాట యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరనే. అయినా ఈ సూక్ష్మాన్ని అర్థం చేసుకునేంత విశాలమైన దృక్పథం లేని ట్రంప్ లాంటి నేతలే ప్రపంచాన్ని ఏలుతున్నారు. చరిత్ర పుటలను తిరగేస్తే కనిపించేది కేవలం రాజ్యాల విస్తరణో, వీరుల పరాక్రమమో కాదు.. ప్రతి యుద్ధం చివరన మిగిలిన శ్మశాన వైరాగ్యం. యుద్ధంలో విజేతలు ఉండరు.. కేవలం ప్రాణాలతో మిగిలిన వారు మాత్రమే ఉంటారు అన్నది జగమెరిగిన సత్యం. కానీ, దురదృష్టవశాత్తూ చరిత్ర నేర్పిన పాఠాలను విస్మరించడమే మానవజాతి అలవాటుగా మార్చుకుంది. ఖొమైనీని చంపేసినా విజయం దక్కలేదు చరిత్రలో యుద్ధాలు ఎప్పుడూ ఒక ముగింపును ఇవ్వలేదు, అవి కేవలం కొత్త అధ్యాయాలకు రక్తపాతంతో కూడిన ప్రారంభాలను మాత్రమే రాశాయి. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖొమైనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన నాయకత్వ నిర్మూలన ఆధునిక యుద్ధ తంత్రంలో ఒక సంచలనం కావచ్చు. కానీ, ఒక వ్యక్తిని లేదా ఒక వ్యవస్థ శిఖరాగ్రాన్ని తొలగించినంత మాత్రాన ఆ దేశంపై లేదా ఆ సిద్ధాంతంపై విజయం సాధించామనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని అనంతర పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇరాన్ వంటి దేశాల్లో అధికారం అనేది కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదు. దశాబ్దాలుగా అక్కడ నిర్మితమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, ఒక బలమైన మతపరమైన అధికార యంత్రాంగం, నాయకత్వం కోల్పోయినప్పుడు మరింత ఉధృతంగా స్పందిస్తాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. ఫలితంగా గల్ఫ్ దేశాలు తమ ఎడారి వంటి వాతావరణంలో ఎంతో కష్టపడి నిర్మించుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు ముప్పు ఏర్పడింది. శత్రువును నామరూపాలు లేకుండా చేయాలనే ఆకాంక్ష సిద్ధాంతపరంగా బాగుండవచ్చు కానీ, క్షేత్రస్థాయిలో అది అసాధ్యం. విత్తనాన్ని మట్టిలో పాతిపెడితే అది చనిపోదు, మరింత బలమైన వృక్షంగా మొలుస్తుంది. యుద్ధాల విషయంలో కూడా పగ, ప్రతీకారాలు అలాగే రూపాంతరం చెందుతాయి. ఖొమైనీ మరణం తర్వాత ఇరాన్ బలహీనపడిందని జరుగుతున్న పరిణామాలను చూసి ఎవరూ అనుకోవడంలేదు. ఒక కేంద్రీకృత నాయకత్వం లేనప్పుడు, ఆ వ్యవస్థలోని చిన్న చిన్న విభాగాలు స్వయంప్రతిపత్తితో విధ్వంసానికి తెగబడే ప్రమాదం ఉంది. ఇప్పుడు మనం చూస్తున్నట్లుగా, హోర్ముజ్ జలసంధి మూసివేత, అంతర్జాతీయ ఇంధన సరఫరాపై దాడులు, లెబనాన్ నుండి హిజ్బుల్లా ప్రయోగిస్తున్న క్షిపణులు.. ఇవన్నీ ఒక దేశాన్ని దెబ్బకొడితే ప్రపంచం మొత్తం ఎలా వణికిపోతుందో నిదర్శనాలు. విజేతగా నిలిచామని సంబరపడే లోపే, ఆర్థిక మాంద్యం , ప్రాంతీయ అస్థిరత అనే రూపాల్లో ఓటమి తలుపు తడుతోందని ఎప్పటికప్పుడు అనుభవమైన నిజం.యుద్ధంలో గెలిచిన వాడు కూడా ఓడిపోయిన వాడితో సమానమే, ఎందుకంటే ఇద్దరూ తమ ఆత్మీయులను కోల్పోతారు.'' అని శ్రీశ్రీమద్భాగవతంలో మనం చెప్పుకున్నాం. యుద్ధం ము గురించి చరిత్ర కేవలం గెలిచిన పక్షం పేరును మాత్రమే చెబుతుంది. కానీ ఆ గెలుపు కోసం చెల్లించిన మూల్యాన్ని ఎప్పుడూ విస్మరిస్తుంది. సరిహద్దుల మీద ఎగిరే జెండా ఆ దేశపు ఆత్మగౌరవానికి చిహ్నంగా కనిపించవచ్చు, కానీ ఆ జెండాను మోయాల్సిన యువతరం శ్మశానాల్లో కలిసిపోవడం ఏ విజయానికి సంకేతమనేది ఎవరు చెప్పగలరు? ఆధిపత్యం కోసం జరిగే ఈ పోరాటంలో అగ్రరాజ్యాలుగా వెలుగొందాలని చూసే దేశాలు, తమ భావి తరాల ఉనికినే పణంగా పెడుతున్నాయి. యుద్ధరంగంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యం మాత్రమే. ఆర్థికంగా బలపడటం కోసం లేదా భూభాగాల కోసం చేసే యుద్ధాలు, ఒక దేశపు వెన్నెముకను విరిచేస్తాయి. యుద్ధం వల్ల కలిగే విధ్వంసం కేవలం భవనాలకూ, ఆస్తులకూ పరిమితం కాదు. అది ఒక దేశపు ఆర్థిక మూలాలను, సామాజిక సమతుల్యతను దశాబ్దాల పాటు కుంగదీస్తుంది. యుద్ధం కోసం వెచ్చించే వేల కోట్ల నిధులు మానవాభివృద్ధికి ఉపయోగపడాల్సినవి, కానీ అవి వినాశనానికి ఖర్చవుతున్నాయి. ఈ ప్రక్రియలో కోల్పోయిన మానవ వనరులు, మేధస్సు మళ్ళీ పునరుద్ధరించలేనివి. విజేతగా నిలిచిన దేశం కూడా పతనమైన ఆర్థిక వ్యవస్థతో, గాయపడిన సమాజంతోనే మనుగడ సాగించాల్సి వస్తుంది. ఇప్పుడు అమెరికా,ఇజ్రాయెల్‌లకు రేపు యుద్ధం చేయాలనుకునే మరో దేశానికీ అదే పరిస్థితి వస్తుంది. ఆధునిక కాలంలో యుద్ధం అనేది కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, అది ఒక తరం మేధస్సును, సృజనాత్మకతను అణచివేసే చీకటి అధ్యాయం. యుద్ధం వల్ల కలిగే మానసిక గాయాలు, అస్థిరత సమాజంలో విద్వేష బీజాలను నాటుతాయి.మూడవ ప్రపంచ యుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో నాకు తెలియదు కానీ, నాలుగవ ప్రపంచ యుద్ధం మాత్రం రాళ్లు, రప్పలతో జరుగుతుంది.. ఐన్‌స్టీన్ చెప్పిన మాటను ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తున్న నేతలు గుర్తు తెచ్చుకోవాలి. చరిత్ర పుటల్లో తమ పేరు శాశ్వతంగా నిలిచిపోవాలనే కొందరు పాలకుల వ్యక్తిగత అహంకారం, నేడు లక్షలాది మంది సామాన్యుల జీవితాలను బలిపీఠం ఎక్కిస్తోంది. యుద్ధాన్ని ఒక దౌత్యపరమైన సాధనంగా కాకుండా, తమ ఉనికిని చాటుకునే ప్రచార అస్త్రంగా మార్చుకోవడం అత్యంత ప్రమాదకరం.

# కాళేశ్వరం నీళ్లు వాడుకుంటూ ప్రాజెక్టు లేదంటారు..

**ఇంతకంటే సిగ్గుచేటు ఉందా**

**కాంగ్రెస్ నేతలవి బూతులు, అబద్ధపు మాటలు.. కేసీఆర్ చేతలు..**

**ముఖ్యమంత్రి మాట్లాడే బూతులు రైతుల కడుపు నింపవు. బూతులు ఆపి.. సకాలంలో రైతుబంధు ఇవ్వండి..**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ పర్యటనలో భాగంగా కురిక్యాల వద్ద కొండన్నపల్లి వరద కాలువను మాజీ మంత్రి హరీశ్ రావు గారు పరిశీలించారు. ఆయన వెంట మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, స్థానిక మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు ఉన్నారు. కాలువ పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీష్ రావు..పొద్దున లేస్తే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని రేవంత్ రెడ్డి గారు పదేపదే అబద్ధాలు చెబుతున్నారు. మరి ఈ నిమిషానికి వరద కాలువలో పారుతున్న నీళ్లు కాళేశ్వరం నీళ్లు కాదా? లక్ష్మీ పంప్ హౌస్ మోటార్లు నడుస్తుంటేనే కదా ఈ నీళ్లొచ్చాయి?ప్యాకేజీ 6, ప్యాకేజీ 8 కింద మోటార్లు పెట్టి, టన్నెల్స్ పనులు పూర్తి చేసి, వరద కాలువను ఒక రిజర్వాయర్‌గా మార్చి.. చొప్పదండి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, బాల్కొండ నియోజకవర్గాలకు అద్భుతంగా సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లు వాడుకుంటున్నారు, కాళేశ్వరం మోటార్లు నడుపుతున్నారు, ఆ నీళ్లతోనే పంటలు పండుతున్నాయి.. కానీ బయట మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టే లేదని చిల్లర మాటలు మాట్లాడటం ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తికి సిగ్గుచేటు.వరద కాలువలో పారుతున్న నీళ్లు, ఆ కాలువ మీద ఆధారపడి పండుతున్న లక్షలాది ఎకరాల పంటలు కాళేశ్వరం పుణ్యం కాదా? మిడ్ మానేరుతో పాటు అనంతగిరి, రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్లలో నింపిన జలాలు కాళేశ్వరం నీళ్లు కావా..ఈ రిజర్వాయర్ల కింద పండుతున్న పంటలన్నీ కాళేశ్వరం జలాలతోనే కదా..కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం ఒక మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదు. అందులో 100 కంపోనెంట్లు ఉన్నాయి. 3 బ్యారేజీలు, 16 రిజర్వాయర్లు, 18 సబ్‌స్టేషన్లు, 203 కిలోమీటర్ల టన్నెళ్లు, 1600 కిలోమీటర్ల గ్రావిటీ కాలువలు.. ఇవన్నీ కలిపితేనే కాళేశ్వరం ప్రాజెక్టు అని కాంగ్రెస్ నేతలు తెలుసుకోవాలి.కాళేశ్వరం ప్రాజెక్టు లేకుండానే రాష్ట్రంలో వరి పండుతోందని రేవంత్ రెడ్డి చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనం. 2022 సంవత్సరంలోనే దేశంలో అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దింది కేసీఆర్ గారే. మెదక్, సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల, హుజురాబాద్ ప్రాంతాల్లో నేడు కళకళలాడుతున్న పంటలన్నీ కాళేశ్వరం చలవే.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండున్నరేళ్లలో ఒక్క కాలువ తవ్వలేదు, ఒక్క చెక్ డ్యాం నిర్మించలేదు, ఒక్క ప్రాజెక్టు కట్టలేదు. కనీసం కాలువల తవ్వకానికి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదు.

# '23న ఎస్సీ కార్పొరేషన్ ముందు చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలి'

**కెవిపిఎస్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున**

రామగిరి, మార్చి 07 : గత పది సంవత్సరాలుగా దళితుల అభివృద్ధి పూర్తిగా శూన్యంగా మారిందని, ప్రభుత్వాలు మారినా దళితులకు సంబంధించిన సంక్షేమ పథకాలు అమలు కాలేదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. ఈ నెల 23న నల్లగొండ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ముందు భారీ ఎత్తున దళితులతో ధర్నా నిర్వహిస్తున్నట్లు, ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికి మెరుగైన కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి కేటాయింపులు చేయలేదని, యాక్షన్ ప్లాన్ కూడా విడుదల చేయలేకపోయిందని విమర్శించారు. జిల్లాలో పరిశ్రమల కేంద్రం ద్వారా దళితులు, గిరిజనులకు ఇవ్వాల్సిన సబ్సిడీలు కూడా నాలుగు సంవత్సరాలుగా అందకపోవడం ఏమిటని ప్రశ్నించారు.ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కాగితాలకే పరిమితమైపోయాయని, వాటిని ఖర్చు చేసి దళితుల సంక్షేమానికి ఉపయోగించిన దాఖలాలు కనిపించడం లేదన్నారు. దళితులకు భూమి, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, మంచినీరు, మురికికాలువలు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఇప్పటికీ అందకపోవడం బాధాకరమన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా కులరహిత సమాజ నిర్మాణం కోసం పెద్ద ఎత్తున సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పూలే?అంబేద్కర్ జనజాతర కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో సర్వేలు నిర్వహించి ఉద్యమాలు, పోరాటాలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రెమిడాల పరిషరాములు, సహాయ కార్యదర్శులు గాదె నరసింహ, బొల్లు రవీందర్, పెరికే విజయ్ కుమార్, ఒంటెపాక కృష్ణ, కోడిరెక్క మల్లన్న, జిల్లా కమిటీ సభ్యులు దండు రవి, చిలుముల రామస్వామి, రాజశేఖర్, వెంకన్న పాల్గొన్నారు.




# మూడు విడతల రైతు భరోసాను విడుదల చేయాలని బీఆర్ఎస్ ధర్నా

దండేపల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకిగా పనిచేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు అన్నారు. రైతు భరోసా ఇవ్వాలని కోరుతూ మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలో శనివారం రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. మూడు విడతల రైతు భరోసాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు .కాంగ్రెస్ ప్రభుత్వం మూడు ఎకరాల లోపు మాత్రమే ఇచ్చి మిగతా రైతులకు అన్యాయం చేసిందన్నారు. ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యే నాటికి రైతు భరోసా పూర్తిగా విడుదల చేయాలని లేని పక్షంలో నియోజకవర్గ రైతులతో కలిసి కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు అన్యాయం జరిగితే బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, రైతుల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తిప్పని లింగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చుంచు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, అక్కల రవీందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొల్ల రాజమల్లు, ముద్దసాని తిరుపతి, ఆశెట్టి వెంకటరమణ, గొల్లపెల్లి అజయ్, అల్లంల సంతోష్, ఇసాకర్,నజీర్ భూమన్న, మల్లయ్య, పత్తిపాక శ్రీనివాస్, ఇప్ప సాయి, హరీష్, రాకేష్, తిరుపతి, ఇస్మాయిల్, స్వామి గౌడ్, కుమార్, తదితరులు ఉన్నారు.



# ఇండియాను కాదని పాకిస్తాన్‌కు ట్రంప్ ప్రాధాన్యం..

**భారీ తప్పిదం అంటున్న ఆస్ట్రేలియా మాజీ ప్రధాని**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియాకన్నా పాకిస్తాన్‌కు కొన్నిసార్లు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌లతో ట్రంప్ సమావేశమయ్యాడు. అయితే, ఈ వైఖరిపై ఆస్ట్రేలియా మాజీ ప్రధాని టోనీ అబాట్ స్పందించారు. ఇండియాను దూరం పెట్టి పాకిస్తాన్‌కు ట్రంప్ ప్రాధాన్యం ఇవ్వడం భారీ తప్పిదమని టోనీ అభిప్రాయపడ్డారు.ఈ మేరకు ఒక మీడియా సంస్థతో టోనీ మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్ తీరును తప్పుబట్టారు. భారత్‌తో ట్రంప్ అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. "ట్రంప్ అనుసరిస్తున్న విదేశాంగ విధానానికి నేనేమీ అభిమానిని కాదు. ఈ విషయంలో ట్రంప్ చేస్తున్న అతిపెద్ద తప్పిదం ఇండియాను తక్కువగా చూడటం. టారిఫ్‌లతో ఇండియాను ఇబ్బంది పెడుతున్నారు. అలాగే పాకిస్తాన్, ఇండియా మధ్య యుద్ధాన్ని తానే ఆపానని చెబుతారు. పైగా ఇటీవల వైట్‌హౌజ్‌లో పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు ఆతిథ్యం ఇచ్చారు. ఇండియాకు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌కు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదు. ఇండియాను కాదని పాకిస్తాన్‌కు ప్రాధాన్యమివ్వడం తప్పు" అని టోనీ అబాట్ వ్యాఖ్యానించారు. ఇండియా విషయంలో అమెరికా అనవసరంగా ఈ వైఖరి పాటిస్తున్నట్లుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇరాన్ సంక్షోభంపై కూడా ఆయన మాట్లాడారు. "ఇరాన్‌లో పాలన మారుతుందో లేదో కచ్చితంగా చెప్పలేం. ఇరాన్‌లోని అనేకవర్గాలపై ఇప్పటి పాలకులకు ఉన్న పట్టును మనం తక్కువగా అంచనా వేయకూడదు. ఏదేమైనా ఇస్లామిక్ పరిపాలనే ఉంటుంది. అయితే, ఎలాంటి ప్రభుత్వం కొనసాగినా ఇరాన్ ఇప్పటిదాకా అనుసరించిన దూకుడు వైఖరి ఉండదనుకుంటున్నాను" అని టోనీ అబాట్ అన్నారు.

# భారీగా మావోయిస్టుల లొంగుబాటు..31 ఏకే 47, ఆయుధాలు అప్పగింత



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు లొంగిపోయిన వారిలో మావోయిస్టు నేతలు దేవ్‌జీ , బడే చొక్కారావు తో పాటు పలువురు ఉన్నారు.శనివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో డీజీపీ హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యాన సీఎం సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం 126 మంది 134 తుపాకులతో లొంగిపోవడం విశేషం. వీటిలో 31 ఏకే 47 తుపాకులున్నాయి. ఈ సందర్భంగా నక్సల్స్ అప్పగించిన తుపాకులను సీఎం పరిశీలించారు.

# మహిళ లేనిదే మనుగడ లేదు : డా.కేశవులు ముదిరాజ్




రామగిరి, మార్చి 07 : మహిళ లేనిదే మనుగడ లేదని, మానవ జీవితంలో మహిళ ఎన్నో పాత్రల్లో తన ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, త్యాగనిరతిని చాటుతుందని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణం మర్రిగూడ ఎం.వి.ఆర్ గెలాక్సీ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సృష్టికి మూలం స్త్రీ మూర్తి అని కొనియాడారు. సమాజంలో మహిళలను గౌరవించడం ప్రతి వ్యక్తి బాధ్యతని, విద్యార్థులకు మహిళల గొప్పతనాన్ని చిన్నతనం నుండే వివరించి సమాజంలో వారిని గౌరవించే విధంగా చూడాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల మహిళా టీచర్లను, సిబ్బందిని శాలువా, మెమెంటులతో సత్కరించారు. పాఠశాల వ్యవహర్త డాక్టర్ జి.వి రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, గంగాభవాని, రాగిణి, శృతి, వినీత, లావణ్య, ప్రసన్న కుమారి, లక్ష్మి, ఉమారాణి, అనిత, యాదమ్మ, రాములమ్మ, మర్రి గణేష్, రాజు పాల్గొన్నారు.

# ఏటీఎం ధ్వంసం చేసి చోరీ

సంగారెడ్డి,సంగారెడ్డి జిల్లాలో ఏటీఎం చోరీ కలకలం రేపింది. గడ్డపోతారం మున్సిపల్ కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన ఏటీఎంను దుండగులు టార్గెట్ చేశారు. ఏటీఎంను ధ్వంసం చేసి అందులో ఉన్న సుమారు లక్ష అరవై వేల రూపాయల నగదును పహరించారు. ఈ ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్

## 3500 కోట్ల నష్టం..440 కోట్ల జప్తు

విజయవాడ, మార్చి 7,ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రూ.441.63 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలు, బూనేటి చాణక్య, వాసుదేవ రెడ్డి బంధువులు, ఇతర వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం స్వాధీనం చేసుకుంది. జప్తు చేసిన ఆస్తుల్లో బ్యాంకు నిల్వలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మద్యం విధానంలో అవకతవకల వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.4,000 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.2019కి ముందు రాష్ట్రంలో మద్యం వ్యాపారం పారదర్శకంగా, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా నడిచేది. కొనుగోలు నుంచి విక్రయాల వరకు ప్రతి దశను డిజిటల్‌గా నమోదు చేసేవారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం రిటైల్ మద్యం దుకాణాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సమయంలో ఆటోమేటెడ్ వ్యవస్థను నిలిపివేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేసినట్టు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. దీంతో సరఫరా ఆర్డర్లు జారీ చేసే విషయంలో అధికారులకు విస్తృత స్వేచ్ఛ లభించిందని ఈడీ తెలిపింది.మాన్యువల్ విధానాన్ని ఉపయోగించి మార్కెట్‌లో ఉన్న కొన్ని ప్రముఖ మద్యం బ్రాండ్లను పక్కన పెట్టారని దర్యాప్తులో తేలింది. అదే సమయంలో కొందరు ఇష్టమైన బ్రాండ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సరఫరా ఆర్డర్లు మంజూరు చేసినట్టు వెల్లడైంది. అదే పేర్లతో పోలి ఉండే కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి వాటి ధరలను కృత్రిమంగా పెంచారని ఈడీ పేర్కొంది. దీంతో డిస్టిలరీలకు అధిక లాభాలు వచ్చి అవి లంచాల రూపంలో తిరిగి సిండికేట్ సభ్యులకు చేరినట్టు వెల్లడయింది.సరఫరా ఆర్డర్లు పొందేందుకు డిస్టిలరీలు ఒక్కో కేసు ధరలో 15 నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్‌లు చెల్లించాల్సి వచ్చిందని దర్యాప్తులో తేలింది. చెల్లించేందుకు నిరాకరించిన తయారీదారులపై ఒత్తిడి తెచ్చి చెల్లింపులు నిలిపివేయడం, ఆర్డర్లు తిరస్కరించడం వంటి చర్యలు తీసుకున్నట్టు వెల్లడైంది. ఈ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని దాచేందుకు ఎన్‌క్రిప్టెడ్ వాయిస్ కాల్స్, సిగ్నల్ వంటి యాప్‌లను ఉపయోగించినట్టు ఈడీ తెలిపింది. ఇందులో బూనేటి చాణక్య , ముప్పిడి అవినాష్ అలియాస్ సుమిత్, మహ్మద్ సైఫ్ వంటి వారు కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంది.కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని సిండికేట్ రాష్ట్రంలో మద్యం కొనుగోలు?పంపిణీ వ్యవస్థను ప్రభావితం చేసి బహుకోట్ల కుంభకోణం నిర్వహించినట్టు ఈడీ పేర్కొంది. ంఖూఃఅఒ కొనుగోలు ప్రక్రియలో జోక్యం చేసి రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.3,500 కోట్ల నష్టం కలిగించినట్టు దర్యాప్తులో తేలింది. సిండికేట్ సభ్యులు కిక్‌బ్యాక్‌ల రూపంలో సుమారు రూ.3,500 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలను నియంత్రణలోకి తీసుకుని వాటి ద్వారా అక్రమ ఆదాయం సృష్టించినట్టు ఈడీ తెలిపింది. అదాన్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, లీలా డిస్టిలరీలు, యూ.వి. డిస్టిలరీలు వంటి సంస్థలకు అధిక వ్యాపారం కల్పించినట్టు పేర్కొంది. మద్యం రవాణా టెండర్‌ను సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించి గతంతో పోలిస్తే ఎక్కువ ధరలు చెల్లించినట్టు కూడా వెల్లడించింది. ఆ కాంట్రాక్టు ఆదాయంలో కొంత భాగాన్ని ఇతర సంస్థల ద్వారా మనీలాండరింగ్ చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలు ముడిసరుకు, ప్యాకేజింగ్ సరఫరా పేరుతో కల్పిత కంపెనీలను ఉపయోగించి నిధులను నగదుగా మార్చినట్టు ఈడీ తెలిపింది. ఈ అక్రమ నిధులను భూములు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి మార్గాల్లో పెట్టుబడిగా మార్చినట్టు వెల్లడించింది. ఇందుకోసం ఈశాన్వి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఈడి ఎంటర్‌టైన్‌మెంట్, యూని కార్పొరేట్ సొల్యూషన్స్, ట్యాగ్ డెవలపర్స్ వంటి సంస్థలను వినియోగించినట్టు తెలిపింది.కొనుగోలు, సరఫరా విధానాలను ప్రభావితం చేసి సిండికేట్ నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అక్రమ ఆదాయం పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నగదు కిక్‌బ్యాక్‌లను హైదరాబాద్‌లోని వివిధ ప్రదేశాల్లో నిల్వ ఉంచినట్టు కూడా గుర్తించింది.ఇప్పటివరకు దర్యాప్తులో రూ.1,048.45 కోట్ల మనీ ట్రైల్ గుర్తించినట్టు ఈడీ వెల్లడించింది. ఇందులో నగదు, బంగారం రూపంలో చెల్లించిన కిక్ బ్యాక్ లు, డిస్టిలరీల నియంత్రణ, మద్యం రవాణా ద్వారా వచ్చిన లాభాలు ఉన్నాయి.ఈ అక్రమ ఆదాయంతో ఆస్తులు కొనుగోలు చేసి వ్యక్తిగత లాభాల కోసం వినియోగించినట్టు తేలింది. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

# పెళ్లిళ్లు..ఓదార్పులేనా....

కడప, మార్చి 7,గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా వెళ్లి బాధితుల్ని పరామర్శించేవారు. కానీ ఇప్పుడు ఆయన రూట్ మారిపోయింది. ఘోర విషాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను ఓదార్చడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. పార్టీ నేతలు అరెస్టు అయితే యాత్రగాతో వెళ్లి పరామర్శలు చేస్తున్నారు. అదికూడా కొంత మంది కే. మిగిలిన వారిని ఇంటికి పిలిపించుకుని ఓదారుస్తున్నారు. ఇక ప్రజాసమస్యలు.. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే మాత్ర అసలు వెళ్లడం లేదు. ఈ నెలలో రెండు, మూడు ఘోర విషాదాలు ఏపీలో జరిగాయి. ఒకటి కల్తీ పాల విషాదం, రెండు బాణసంచా విషాదం. ఉత్తరాంధ్రలో డయేరియా వల్ల కూడా కొంతమంది చనిపోయారు. సాధారణంగా ఇలాంటివి జరిగినప్పుడుప్రతిపక్ష పార్టీలు హడావుడి చేస్తాయి. కానీ జగన్మోహన్ రెడ్డి అసలు పట్టించుకోలేదు జగన్ పరామర్శలు చేస్తారని వైసీపీ వర్గాలు అనుకున్నా.. ఈ వారం ఆయన పెళ్లిళ్లకు మాత్రవే పరిమితమయ్యారు. గత రెండేళ్లుగా జగన్ చేస్తున్నది ఇదే. వైసీపీ ఓడిపోయిన తర్వాత జగన్ రాజకీయం పూర్తిగా విజిటింగ్ ప్రొఫెసర్ తరహాలో జరుగుతోంది. వారానికి మూడు, నాలుగు రోజులు మాత్రమే తాడేపల్లిలో ఉంటున్నారు. బుధవారం వచ్చి శుక్రవారం బెంగళూరుకు వెళ్లిపోతున్నారు. ఈ సమయంలో ఓ ప్రెస్మీట్ లేకపోతే పార్టీ నేతలతో సమావేశం సందర్భంగా మాట్లాడి ఆ వీడియోలను విడుదల చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లిన సందర్భాలు తక్కువ. ఓ సారి చిత్తూరులో మామిడి రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లారు. ఆ తర్వాత పార్టీ నేతల ఇళ్లకు పరామర్శలకే వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి తన పర్యటనలను ఎక్కువగా రాజకీయ కారణాలకే పరిమితం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత జగన్ వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు తిరస్కరించారన్న భావనలో జగన్ ఉన్నారని .. ఆ అసంతృప్తి ఆయనలో ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే జగన్ స్వయంగా తనకు నలభై శాతం ఓటు బ్యాంక్ ఉందని చెబుతూ ఉంటారు. ఆ కోణంలోనే ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన ప్రతిపక్ష హోదాలో ఉండి కూడా, ఆయన కేవలం ప్రెస్ నోట్లు, సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కావడం పార్టీ క్యాడర్ ను అసంతృప్తికి గురి చేస్తోంది. అయితే వైసీపీ పెద్దలు మాత్రం మరో విధంగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైకాపా నాయకులపై కేసులు బనాయిస్తోందని, వారిని కాపాడుకోవడమే ప్రస్తుతానికి ప్రాధాన్యత అని జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో గెలిచిన దగ్గర నుండే జగన్ జనంతో నేరుగా మమేకం అవ్వడం తగ్గించారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నాయి. ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా అదే ధోరణి కొనసాగించడం రాజకీయంగా ఆత్మహత్యాసదృశ్యమేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఒకప్పుడు ఓదార్పు యాత్ర పేరుతో ఊరూరా తిరిగిన జగన్, ఇప్పుడు అదే ప్రజలు కష్టాల్లో ఉంటే వెళ్లడానికి వెనకాడుతుండటం ఆయన ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. అయితే జగన్ మూడేళ్ల పాటు ప్రజా సమస్యలను పట్టించుకోకూడదని..చివరి రెండేళ్లు పాదయాత్ర చేస్తారు కాబట్టి అంతా కవర్ అయిపోతుదంని పార్టీ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రజలు ఆయన మూడేళ్లు ఏం చేశారన్నది మర్చిపోతారని. చివరి రెండేళ్ల పోరాటంతోనే ఓట్లేస్తారని అంటున్నారు.

# విజయవాడ విద్యాదరాపురం లో దారుణం

**మూడు సంవత్సరాల పాప పై యాసిడ్ పోసిన స్కూల్ టీచర్**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

విజయవాడ,విజయవాడ విద్యాదారపురం నేషనల్ ప్లే స్కూల్ లో టీచర్ చేసిన నిర్వాకం ఆలస్యంగా బయటపడింది. ఫిబ్రవరి 23 వ తారీకు పాపను నేషనల్ స్కూల్ దగ్గరపాపను తల్లీ దింపింది. కాసేపటికి స్కూల్ నుంచి పాప బాతురూమ్ లో పడిపోయింది అని తల్లి కి ఫోన్ వచ్చింది. వెంటనే పాప తల్లీ, అక్క స్కూల్ కి వచ్చి ఏడుస్తూ ఉన్న పాపని హాస్పిటల్ కి తీసుకువెళ్లారు . పాపను హాస్పిటల్ కు తీసుకువెళ్తే నిజాలు బయటపడ్డాయి. తల్లిదండ్రులు స్కూల్ దగ్గర కు వెళ్లి స్కూల్ యజమానాన్ని గట్టిగా అడుగగా నిజం స్కూల్ యాజమాన్యం ఒప్పుకుంది. హాస్పిటల్ లో బిల్లు కట్టి చేతులు దులుకుకుంది. తరువాత కొంత డబ్బులు ఇచ్చి రాజీకి రమ్మని స్కూల్ యాజమాన్యం చెప్పింది. తల్లిదండ్రులు ఒప్పుకోవకపోవడం తో బెదిరింపులకు దిగింది. ఈ విషయాలు బయటకు చెప్తే మీ అంతుచుస్తాను అంటూ ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు వార్నింగ్ ఇచ్చారు. డీసీపీ తమ చుట్టం అంటూ తల్లిదండ్రులకు బెదిరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తమ కూతురిపై ఇంత కూరాత్మకంగా గాయపరిచిన వారిని శిక్షించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

# అంతా ఫీల్ గుడ్ కాదా..

విజయవాడ, మార్చి 7, కృష్ణా జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ వివాదాలకు ఎట్టకేలకు తెరపడింది. కొలికపూడితో మంతెన సత్యనారాయణ రాజు భేటీ అయి, పార్టీలో దీనిపై ఉన్న సీరియస్ నెస్, రాజకీయంగా కలిగే నష్టాలను చర్చించారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి మధ్య కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించారు. అనంతరం ఈ వివాదాలపై తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్పందించారు. తిరువూరులో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలన్నీ ముగిసినట్లేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పరిణామాలు పార్టీ ప్రతిష్టకు ఏవైనా ఇబ్బందులు కలిగించి ఉంటే తాను చింతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు మళ్లీ రిపీట్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.అధికార ప్రోటోకాల్, పరస్పర గౌరవం గురించి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఖచ్చితంగా ఇస్తానని, అదే సమయంలో ఆయన నుంచి కూడా తాను అదే గౌరవాన్ని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును వాడటం తన అభిమతం కాదని, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన ప్రాణాలకు ముప్పు ఉందని గురువారం ఆరోపించారు. నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణోత్సవం సందర్భంగా జరిగిన ఘటనను ఉటంకిస్తూ, తనపై దాడి చేసి చంపేందుకు పక్కా ప్రణాళిక జరిగిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీ కార్యాలయం నుంచే మధ్యాహ్నం నుండి జనాన్ని సమీకరించాలని ఆదేశాలు వెళ్లాయని, తనను లక్ష్యంగా చేసుకుని ఈ కుట్ర పన్నారని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ అధిష్టానం స్పందించింది. ఇది వ్యక్తిగతంగానే కాదు, పార్టీకి నష్టం కలిగిస్తుందని.. విభేదాలు మంచిది కాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగం తీరుపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిఘా వర్గాల ద్వారా తన గన్ మెన్‌కు ముందస్తు హెచ్చరికలు అందినప్పటికీ, తనకు కనీసం ఒక అదనపు కానిస్టేబుల్‌ను కూడా భద్రతగా కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. నెమలి వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణం సమయంలో కరెంట్ తీసివేసి చీకట్లో తనపై దాడి చేయాలని ప్లాన్ చేశారని, అయితే పోలీసులు అందుకు నిరాకరించడం వల్ల ప్రమాదం తప్పిందని తనకు సమాచారం ఉందని ఆయన వెల్లడించారు.తన కారు అద్దాలు పగలగొట్టి, టైర్ల గాలి తీసి తనను అడ్డుకుని భౌతిక దాడి చేయాలని చూశారనే స్పష్టమైన ఆధారాలు తన వద్ద ఉన్నాయని కొలికపూడి శ్రీనివాసరావు మీడియాతో చెప్పారు. ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే అయ్యుండి కూడా తనకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు తిరువూరు నియోజకవర్గంలో రాజకీయ ఉత్కంఠను మరింత పెంచాయి.

# మార్చి 24 నుండి 28వ తేదీ వరకు శ్రీ వేదనారాయణస్వామి వారి సూర్యపూజోత్సవం, తెప్పోత్సవాలు

తిరుపతి, 2026 మార్చి 07 మార్చి 21న మత్స్య జయంతి నాగలాపురం శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణ స్వామివారి వార్షిక సూర్యపూజ మహోత్సవం, తెప్పోత్సవాలు మార్చి 24 నుండి 28వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. శ్రీమహావిష్ణువు మత్స్యావతారం రూపంలో సంవత్సరాల కొలది యుద్ధం చేసి వచ్చినందున, స్వామి దివ్య శరీరానికి వెచ్చదనం కలిగించేందుకు సూర్య భగవానుడు తన కిరణాలను స్వామివారి మీద ప్రసరింపచేయడమే సూర్యపూజోత్సవం. ఈ ఉత్సవంలో ప్రధాన రాజగోపురం నుండి 630 అడుగుల దూరంలో గల మూలవిరాట్టుపై సూర్యకిరణాలు నేరుగా ప్రసరిస్తాయి. మొదటి రోజు స్వామివారి పాదాలపై, రెండో రోజు నాభిపైన, మూడో రోజు స్వామి శిరస్సుపై సూర్యకిరణాలు ప్రసరించి స్వామి దివ్యరూపాన్ని మరింత తేజోవంతం చేస్తాయి.మార్చి 24 నుండి 28వ తేదీ వరకు జరుగనున్న వార్షిక సూర్యపూజ మహోత్సవం, తెప్పోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 9 నుండి 10 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం



నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటల నుండి 6.30 గంటల వరకు భక్తులకు సూర్యపూజ దర్శనం కల్పించనున్నారు. రాత్రి 7.30 గంటల నుండి 9.00 గంటల వరకు తిరువీధి ఉత్సవం జరుగనుంది.మార్చి 24 నుండి తెప్పోత్సవాలు :శ్రీ వేదనారాయణస్వామివారి ఆలయంలో మార్చి 24 నుండి 28వ తేదీ వరకు ఐదు రోజుల పాటు తెప్పోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుండి 7.30 గంటల వరకు తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. మొదటి రోజు శ్రీదేవి భూదేవి సమేత వేదనారాయణస్వామివారు, రెండవ రోజు గోదాదేవి సమేత వేదనారాయణస్వామివారు, మూడవ రోజు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారు, నాల్గవ రోజు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేదనారాయణస్వామివారు, ఐదవ రోజు శ్రీదేవి భూదేవి సమేత వేదనారాయణస్వామివారు తెప్పలపై విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. తెప్పోత్సవాల అనంతరం మొదటి మూడు రోజులు స్వామి, అమ్మవార్ల (తిరుచ్చి) తిరువీధి ఉత్సవం, నాల్గవ రోజు ముత్యపుపందిరి వాహనం, ఐదవ రోజు పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.మార్చి 21న మత్స్య జయంతి :శ్రీ వేదనారాయణస్వామివారి ఆలయంలో మార్చి 21వ తేదీన మత్స్య జయంతి ఘనంగా జరుగనుంది.ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొల్పి, తోమాల, అర్చన నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 7 నుండి 8.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామివారికి మత్స్య జయంతి ఉత్సవం(తిరువీధి ఉత్సవం) నిర్వహిస్తారు. ఉదయం 9 నుండి 11 గంటల వరకు శాంతిహోమం, ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాఢవీదులలో ఉరేగుతు భక్తులను అనుగ్రహిస్తారు.ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# గామాలపాడు లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

పల్నాడు ,దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డ్రగ్స్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, పదిమంది ఎస్సైలు మరియు పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.గ్రామంలో అనుమానాస్పద ప్రాంతాలను తనిఖీ చేస్తూ ఇళ్లను, వాహనాలను పరిశీలించారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు లేని సుమారు 40 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పలుగులు, గొడ్డళ్లు వంటి ప్రమాదకర ఆయుధాలను కూడా పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై పోలీసులు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, సమాజానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని వివరించారు. మాదక ద్రవ్యాల నివారణ కోసం గ్రామస్తులు సహకరించాలని పోలీసులు కోరగా, గ్రామస్థులు డ్రగ్స్కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటం కోసం ఇలాంటి చర్యలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. పోలీసుల అవగాహన కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి సిఐ భాస్కర్, ఎస్సైలు గామలపాడు గ్రామ పెద్దలు శంకర శెట్టి సుబ్బారావు సుంకర శ్రీనివాసరావు సాంబ తదితరులు పాల్గొన్నారు

# విజయవాడలో ఊహించని ఘటన

విజయవాడ,పోలీసుల కార్డాన్ సెర్చ్ సందర్భంగా అనుకోని ఘటన ఎదరయింది. స్థానిక బాలాజీ హోటల్ లో పోలీసులపై కాల్పులు జరిపేందుకు దుండగుడు ప్రయత్నం చేసాడు. ట్రిగ్గర్ లాక్ కావడంతో అదృష్టవశాత్తు బుల్లెట్ బయటికి రాలేదు. దాంతో ప్రమాదం తప్పింది. పోలీసులు వెంటనే దుండగుడిని పట్టుకుని అతని వద్ద ఉన్న 9 ఎం ఎం తుపాకి.. ఐదు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.

# జిల్లావ్యాప్తంగా ఏకకాలంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు

తిరుపతి,తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఏకకాలంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిధిలోని అన్ని సబ్డివిజన్లలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమానాస్పద ప్రాంతాలు, నివాస ప్రాంతాలు, అద్దె ఇళ్లను ప్రత్యేకంగా పరిశీలిస్తూ ప్రతి ఇంటిని సోదా చేసి అక్కడ నివసిస్తున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అద్దెదారులు, వలస కార్మికులు మరియు ఇతరుల వివరాలను నమోదు చేసుకొని అవసరమైన సమాచారాన్ని సేకరించారు. అదేవిధంగా ప్రాంతాల్లో సంచరిస్తున్న వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకున్నారు. వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు చట్టాలను గౌరవించడం, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు సహకరించాలని ప్రజలందరితో ముకుముడిగా ప్రతిజ్ఞ చేయించారు.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా రెండో రోజు మహా కుంభాభిషేక మహోత్సవాలు

విజయవాడ, మార్చి 7,ఇంద్రకీలాద్రిపై వెలిసిన శ్రీ కనకదుర్గమ్మ వారి దేవస్థానంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు రెండో రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నేడు శనివారం తెల్లవారుజామునే విచ్చేసిన పూజ్యశ్రీ స్వామీజీ పవిత్ర కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఉదయం 9:30 గంటలకు స్వామీజీ వారు అమ్మవారి దర్శనార్థం ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బొర్రా రాధాకృష్ణ (గాంధీ), మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఇూ) సీనా నాయక్ లు స్వామీజీ వారికి ఘనస్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని ఆహ్వానించి, అమ్మవారి ప్రత్యేక దర్శనం మరియు ఆశీస్సులు పొందేలా ఏర్పాట్లు చేశారు.

ముఖ్యాంశాలు:కుంభాభిషేక క్రతువు: 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ విశిష్ట ఘట్టంలో భాగంగా రెండో రోజు అష్టోత్తర కలశ స్థాపన, విశేష హోమాలు నిర్వహించబడుతున్నాయి.అధికారుల పర్యవేక్షణ: భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కమిషనర్ రామచంద్ర మోహన్ గారు, ఆలయ కార్యనిర్వహణాధికారి (ఇూ) శ్రీ సీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# వాడపల్లికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట ,కోనసీమ వాడపల్లి వెంకన్న దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో భక్తులు వేకువ జామునుండే పోటెత్తారు. చందన స్వరూపుడు స్వయంభూ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు వచ్చారు.శనివారం పర్వదినం కావడం తో వాడపల్లిలో స్వయంభూ గా వెలసిన చందన స్వరూపుడు ఏడుశనివారాలు ఏడుప్రదక్షిణలు వెంకన్న బాబుగా ఖ్యాతి గాంచి అశేష భక్త జనంతో మొక్కులు తీర్చుకోవడానికి స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. భక్తులు నాలుగు మాడవీధుల గుండా గోవింద నామస్మరణతో ఏడు ప్రదక్షిణలు అనంతరం స్వామిని దర్శించి వారి వారి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్ రాజు మాట్లాడుతూ వృద్ధులకు, దివ్యాంగులకు, చంటి బిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేశామని క్యూ లైన్ లో ఉన్న భక్తులకు మంచినీరు, బిస్కెట్లు అదజేస్తున్నామని దర్శనానంతరం భక్తులకోసం ఏర్పాటు చేసిన ఉచిత అన్న ప్రసాదం స్వీకరించాలన్నారు

## టౌన్ హాల్లో మహిళా దినోత్సవ వేడుకలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 7:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటదాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మహిళల హక్కులు, సమానత్వం, సాధికారతకు ప్రాధాన్యత కల్పించే ఉద్దేశంతో ఈ



కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవానికి "మహిళల హక్కులు ? న్యాయం ? కార్యాచరణ" అనే అంశాన్ని ప్రధానంగా తీసుకుని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం, మహిళా సంఘాల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వివిధ రంగాలకు చెందిన మహిళలు హాజరుకానున్నారని తెలిపారు. మహిళల అభివృద్ధి, సాధికారత, సమాజంలో వారి పాత్రపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెప్మా పీడీ వెంకటదాస్. డీఆర్‌డీఏ శ్రీధర్ రెడ్డి. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్. లీలావతి. కోరారు.

## నంద్యాలలో వజ్రప్రహార్ ఆపరేషన్ తనిఖీలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 7:మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా "ఆపరేషన్ వజ్రప్రహార్" కింద నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్, గూడ్స్ షెడ్, బొగ్గులైన్ ప్రాంతాల్లో శనివారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలను నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం. జావళి ఐపీఎస్ ఆధ్వర్యంలో చేపట్టారు.సుమారు 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్న ఈ ఆపరేషన్‌లో అనుమానాస్పద ప్రదేశాలు, అద్దె ఇళ్లు, ఖాళీ భవనాలు, వాహనాలను తనిఖీ చేశారు. మారుమూల ప్రాంతాలను పరిశీలించేందుకు డ్రోన్ కెమెరాలను కూడా ఉపయోగించినట్లు ఏఎస్పీ తెలిపారు.రౌడీషీటర్లు, అనుమానితులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గంజాయి సహా మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, ప్రజలు తమ పరిసరాల్లో డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగిల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు తెలియజేయాలని పోలీసులు కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు వేణుగోపాల్, అస్రార్ భాషతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉన్న బిడ్డలకే దిక్కు లేదు

విజయవాడ, మార్చి 7ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జనాభా నియంత్రణ ఎత్తివేత, ఎక్కువ మంది పిల్లలను కనడంపై అసెంబ్లీలో చేసిన ప్రకటన పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగ్యంగా స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆవెం ప్రశ్నించారు."చంద్రబాబు పాపులేషన్ పాలసీ హాస్యాస్పదం. ఉన్న బిడ్డలకే దిక్కులేదు... ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా? మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా? ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు అమలు కాలేదు. మీరు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవు. ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారు. మాఫియాలు చేసుకుంటూ, రాష్ట్రాన్ని దోచుకుంటూ... బిడ్డలను కనమని చెబితే ఎలా చంద్రబాబు గారూ?" అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

# చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఎక్కడ..?

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 7:వేసవి కాలం ప్రారంభమవడంతో నంద్యాల పట్టణంలో ఎండలు రోజురోజుకూ తీవ్రంగా పెరుగుతున్నాయి. ఉదయం 9 గంటలకే భానుడు మండిపడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలు, చలువ పందిళు ్లు మాత్రం పట్టణంలో ఎక్కడా కనిపించకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది.ప్రతి ఏడాది వేసవి



ప్రారంభమయ్యే సమయానికి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, నాలుగు రోడ్ల సెంటర్, బస్టాండ్ ఆవరణ, మున్సిపల్ కార్యాలయం, ఎమ్మార్వో కార్యాలయం, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. అలాగే ట్రాఫిక్ సిగ్నల్ ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి బాటసారులు, వాహనదారులకు తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ సంవత్సరం ఎండలు తీవ్రంగా పెరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.బస్టాండ్ వద్ద బస్సు దిగి పట్టణంలోకి వెళ్లే ప్రయాణికులు తాగునీరు కోసం కిరాణా దుకాణాల్లో డబ్బులు పెట్టి నీటి బాటిళ్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. రోజంతా కష్టపడే కార్మికులు, కూలీలు, చిరు వ్యాపారులు కూడా చుక్క నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.మున్సిపాలిటీకి ప్రజలు చెల్లించే పన్నులు ఎక్కడికి వెళ్తున్నాయని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. లక్షల రూపాయల బడ్జెట్ ఉన్నా కనీసం ఒక కుండ మంచినీరు, మజ్జిగ అందించే ఏర్పాట్లు కూడా చేయలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగితాలకే పరిమితమయ్యే ప్రణాళికలు క్షేత్రస్థాయిలో ఎందుకు అమలు కావడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు, చలువ పందిళ్లు వెంటనే ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని వాహనదారులు, బాటసారులు కోరుతున్నారు.

## దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు పంపిణీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 7 :సిరివెళ్ల మండలంలోని వీరారెడ్డి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేశారు. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ హుస్సేన్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సురేష్, హెచ్ఎం జానకి చేతుల మీదుగా విద్యార్థులకు ప్యాడ్లు అందజేశారు.నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వీరారెడ్డి పల్లె హైస్కూల్‌తో పాటు



మండలంలోని పలు జడ్పీ హైస్కూల్లలో చదువుతున్న వందలాది మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో కృషి, పట్టుదలతో చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు పోటీపడి చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం జానకి పేర్కొన్నారు.ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈటుకూరు వెంకట్ సహకారంతో దాతల సహాయంతో ఈ ప్యాడ్లు అందజేస్తున్నట్లు నాగమల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగశేఖర్, ప్రభాకర్, యాగంటి సుధ, విజయలక్ష్మి, లింగమయ్య, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07:ఈ నెల 9న డోన్ మండలం కొత్త బురుజు గ్రామంలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు ఎలాంటి లోపాలు లేకుండా



పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.హెలిప్యాడ్ మైదానం, సభాస్థలి, వాహనాల పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం వంటి అంశాలను పరిశీలించారు. భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.ముఖ్యమంత్రి సందర్శించనున్న రైతు పొలాన్ని కూడా పరిశీలించి సాగు పరిస్థితులపై రైతులతో మాట్లాడారు. రైతులతో జరిగే సమావేశం సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీఓ నరసింహులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07-నంద్యాల జిల్లా రుద్రవరం మండలం కొండమాయపల్లె పంచాయతీ పరిధిలోని వెలగలపల్లి గ్రామ పొలిమేరలో వెలసిన శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం ఎల్లావత్తుల గ్రామానికి చెందిన పి. శేఖర్ ? వెంకటసుబ్బమ్మ దంపతులు రూ. 1,00,116లను విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే



ఉద్దేశంతో ఈ విరాళాన్ని సమర్పించినట్లు వారు తెలిపారు.దాతల సేవా భావాన్ని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సింగతల మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం రంగనాయకులు, కోశాధికారి కె.వి. నరసింహులు, ఆలయ ప్రధాన అర్చకులు గోపి శర్మ, అన్నదాత ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.


## అంకిరెడ్డి చెరువులో మట్టి తవ్వకాలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07-నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లి సమీపంలోని అంకిరెడ్డి చెరువులో ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. రాత్రి వేళల్లో చెరువులో నుంచి మట్టిని తీసి నంద్యాల పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల చెరువులో నీటి మట్టం తగ్గడంతో అక్రమార్కులు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ చెరువు ప్రాంతంలో భారీగా తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.ఇటీవల కూడా ఇలాంటి తవ్వకాలు జరగడంతో స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ మళ్లీ అదే పరిస్థితి నెలకొనడం పట్ల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో ఎర్రమట్టి తరలింపుతో చెరువు క్రమంగా దెబ్బతింటుందని, భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గే ప్రమాదం ఉందని వారు అంటున్నారు.అర్ధరాత్రి సమయంలో ట్రాక్టర్లు, లారీలు తీసుకొచ్చి మట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో చెరువు పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో భారీ వాహనాల రాకపోకలు పెరిగాయని తెలిపారు.ఇప్పటికైనా రెవెన్యూ, గనుల శాఖ అధికారులు వెంటనే స్పందించి చెరువులో జరుగుతున్న అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువు ఉనికిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అహోబిల మఠం ప్రత్యేక అధికారి రామానుజన్ రాజీనామాకు సిద్ధం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 7:అహోబిల మఠం ప్రత్యేక అధికారిగా మూడు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన రామానుజన్ రాజీనామా చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఈ నెల 9వ తేదీ సాయంత్రం



లోపల రాజీనామా చేయాలని ఆయన నిర్ణయించినట్లు తెలిసింది.తనకు స్వేచ్ఛగా పనిచేసే అవకాశం లేకపోవడంతో పదవిలో కొనసాగడం సాధ్యం కాదని, వృత్తిలో ఉండి మఠానికి మేలు చేయలేనని రామానుజన్ తన అనుచరులకు తెలిపినట్లు సమాచారం. ఈ విషయంపై మధ్యవర్తులు రాజీ ప్రయత్నాలు చేసినప్పటికీ అవి ఫలించలేదని తెలుస్తోంది.మఠం ప్రతినిధులు కూడా చివరికి ఆయన నిర్ణయాన్ని ఆయనకే వదిలినట్లు సమాచారం. మొత్తం మీద రామానుజన్ రాజీనామా అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## కార్డెన్ సెర్చ్ లో కాల్పుల ఘటన

విజయవాడ, మార్చి7,విజయవాడలో శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు చేపట్టిన కార్డన్ సెర్చ్‌లో ఊహించని ఘటన చోటుచేసుకుంది. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. నగరంలోని ప్రముఖ బాలాజీ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులపైనే ఒక దుండగుడు తుపాకీతో కాల్పులు జరిపేందుకు ప్రయత్నించడం అందర్నీ షాక్‌కి గురి చేసింది. అదృష్టవశాత్తూ ట్రిగ్గర్ లాక్ అయిపోవడంతో బుల్లెట్ బయటకు రాలేదు, లేదంటే అక్కడ పెద్ద ప్రాణ నష్టమే జరిగి ఉండేదని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, జిల్లా వ్యాప్తంగా జరిగిన పోలీసు తనిఖీల అప్‌డేట్స్ ఏంటో చూద్దాం. విజయవాడ పోలీసు యంత్రాంగం నగరంలోని నేరస్తుల కదలికలపై నిఘా ఉంచేందుకు హోటళ్లు, లాడ్జీలలో తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో అక్కడ ఉన్న ఒక అనుమానిత వ్యక్తిని పోలీసులు ప్రశ్నించేందుకు యత్నించారు. అతను ఒక్కసారిగా తన వద్ద ఉన్న తుపాకీని తీసి పోలీసులపై గురి పెట్టాడు. ట్రిగ్గర్ నొక్కేందుకు ప్రయత్నించినప్పటికీ, అది లాక్ అయిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దుండగుడిని లొంగదీసుకున్నారు. అతని వద్ద నుంచి ఒక ప్రమాదకరమైన 9ఎంఎం పిస్టల్, ఐదు రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఆ వ్యక్తి తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. ప్రస్తుతం ఈగల్ టీమ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అసలు అతను విజయవాడకు ఎందుకు వచ్చాడు? ఎవరిని లక్ష్యంగా చేసుకున్నాడు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణా జిల్లాలోని పామర్రు ప్రాంతంలో కూడా పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. హరిగోపాల్ నగర్ కాలనీలో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి సుమారు 150 మంది పోలీసుల బృందం రంగంలోకి దిగింది. డీఎస్పీ ధర్మేంద్ర నేతృత్వంలో జరిగిన ఈ ఆపరేషన్ 11 మంది ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు ఇంటింటికీ వెళ్లి నివాసితుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 30 టూవీలర్స్ పోలీసులు సీజ్ చేశారు. ప్రజల రక్షణ కోసమే ఈ తనిఖీలు చేస్తున్నామని, నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**